క్లుప్తంగా

నీట్‌లో ర్యాంక్ సాధించిన విద్యార్థినికి చేయూత



నగదు అందుకుంటున్న శాలిని

నల్లగొండ రూరల్: పేద విద్యార్థిని ఉన్నత చదువులకు రిటైర్డు ఉద్యోగులు అండగా నిలిచారు. నల్లగొండ మండలంలోని నర్సింగ్‌బట్ల గ్రామానికి చెందిన ఎన్నమల్ల వెంకన్న–నాగమ్మ దంపతుల కుమార్తె శాలినికి నీట్‌లో 479వ ర్యాంకు లభించింది. నాగర్‌కర్నూలులో ఎంబీబీఎస్‌లో చేరింది. ఆమె తండ్రి వెంకన్న లారీ డ్రైవర్‌గా పని చేస్తుండగా తల్లి నాగమ్మ కూలి పని చేస్తోంది. శాలిని చదువు నిమిత్తం మంగళవారం ఎస్‌వీడీఎస్ సభ్యులు రూ.41 వేల ఆర్థికసాయాన్ని అందజేసి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో గుండు సాయిలు, జెల్లా శ్రీశైలం, సత్తయ్య, నర్సింహ, మేఘనాథ్, పాండు, రామలింగం, సుధాకర్, అర్జున్ పాల్గొన్నారు.

ఇన్‌చార్జ్ హెచ్‌ఎంగా మాధవి

చిట్యాల: పట్టణంలోని జెడ్పీహెచ్‌ఎస్ ఇన్‌చార్జ్ హెచ్‌ఎంగా గోగికార్ మాధవి మంగళవారం విధుల్లో చేశారు. ఈ సందర్భంగా ఆమెను ఆ పాఠశాల ఉపాధ్యాయులు సత్కరించారు. ఉపాధ్యాయులు మధుమతి, రాజు శ్రీనివాస్, పద్మజ, శ్రీనివాసులు, ఇందిరా, క విత, సైదులు, ప్రసన్న, శైలజ, మంజుల, శంకరయ్య, సాధిక్, జానకి, తిరుమల పాల్గొన్నారు.

పోలీసులకు ఫిర్యాదు

నాంపల్లి : మండల కేంద్రంలోని జెడ్పీహెచ్‌ఎస్‌లో సీసీ కెమెరాలు, ట్యాంకుల నల్లాలను ధ్వంసం చేసిన దుండగులపై చర్యలు తీసుకోవాలని కోరుతూ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు జి.అజయ్‌కుమార్ మంగళవారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఆయన వెంట ఉపాధ్యాయులు ఉన్నారు.

రేపు శ్రీ లక్ష్మీరామకోటి గీతా యజ్ఞం

నాంపల్లి : మండల కేంద్రంలోని శ్రీ ఉమానాగ లింగేశ్వర స్వామి ఆలయంలో గురువారం శ్రీలక్ష్మీరామకోటి గీతా 100వ యజ్ఞం నిర్వహిస్తున్నట్లు ఆలయ చైర్మన్ పెద్దిరెడ్డి అనంతరెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. యజ్ఞం అనంతరం అన్నప్రసాద వితరణ కార్యక్రమం ఉంటుందన్నారు.

బీఆర్‌ఎస్ నాయకుడు మృతి



ఫరీదుద్దీన్ (ఫైల్)

నల్లగొండ టూటౌన్: పట్టణానికి చెందిన బీఆర్‌ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు సయ్యద్ ఫరీదుద్దీన్ మంగళవారం అనారోగ్యంతో మృతి చెందాడు. ఆయన మృతి పట్ల మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి సంతాపం తెలిపారు.

నేడు 'చలో నిజామాబాద్'

నల్లగొండ టౌన్: ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ అనుబంధ సంఘాల రాష్ట్ర సదస్సును ఈ నెల 16న నిజామాబాద్‌లో నిర్వహించనున్నట్లు ఎంఎస్పీ జిల్లా అధ్యక్షుడు బకరం శ్రీనివాస్, ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు ఇరిగి శ్రీశైలం తెలిపారు. ఆయా సంఘాల నాయకులు, విద్యార్థులు, ఉద్యోగులు హాజరై సదస్సును విజయవంతం చేయాలని కోరారు.

మంత్రిని కలిసిన ప్రభుత్వ న్యాయవాది

రామగిరి(నల్లగొండ): జిల్లా కోర్టులో పోక్సో కోర్టు స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా ఇటీవల నియమితులైన వేముల రంజిత్‌కుమార్ మంగళవారం మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డిని కలిశారు. తన నియామకానికి సహకరించిన మంత్రికి కృతజ్ఞతలు తెలిపారు.

నేడు కంటి పరీక్ష శిబిరం

నల్లగొండ టూటౌన్: పట్టణంలోని యూటీఎఫ్ భవన్‌లో మ్యాక్సివిజన్ మహాలక్ష్మి కంటి ఆస్పత్రి హైదరాబాద్ ఆధ్వర్యంలో రిటైర్డు ఉద్యోగులకు బుధవారం ఉచిత కంటి పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలంగాణ పెన్షనర్స్, రిటైర్డు పర్సన్స్ అసోసియేషన్ నాయకులు నూకల జగదీష్‌చంద్ర, పందిరి శ్యాంసుందర్ తెలిపారు. ఆపరేషన్ చేయాల్సిన వారిని నల్లగొండ నుంచి హైదరాబాద్‌కు ఆస్పత్రి యాజమాన్యం వారే తీసుకెళ్లి ఉచితంగా ఆపరేషన్ చేస్తారని పేర్కొన్నారు.

బీజేపీతోనే గ్రామాల అభివృద్ధి

మునుగోడు: బీజేపీతోనే గ్రామాలు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతాయని బీజేపీ జిల్లా కార్యదర్శి బొడిగె అశోక్ గౌడ్ అన్నారు. మంగళవారం మునుగోడులో పలువురికి పార్టీ సభ్యత్వాలు అందజేసి మాట్లాడారు. బీజేపీ మండల అధ్యక్షుడు పెంబళ్ల జానయ్య, మాదగోని నరేందర్ గౌడ్, అక్కెనపల్లి సతీష్, బ్రహ్మాచారి, పందుల యాదయ్య, స్వామి పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత

మర్రిగూడ : ఇటీవల రోడ్డు ప్రమాదంలో తూర్పుతండాకు చెందిన కొండూరు గ్రామ ఫీల్డ్ అసిస్టెంట్ జర్పుల బిచ్యానాయక్ మృతిచెందారు. విషయం తెలుసుకున్న రాజాపేట తండాకు చెందిన సామాజిక కార్యకర్త కొడాల అల్వాల్‌రెడ్డి మంగళవారం బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. అనంతరం రూ.10వేల ఆర్థిక సహాయం అందజేశారు.

వానొస్తే రాకపోకలు బంద్

- వర్షానికి కల్వర్టుల పైనుంచి ప్రవహిస్తున్న వరద నీరు
- నిలిచిపోతున్న ప్రయాణాలు
- తీవ్ర ఇబ్బందులు పడుతున్న గట్టుప్పల్ మండల ప్రజలు

చండూరు(గట్టుప్పల్) : గట్టుప్పల్ నూతన మండలంగా ఏర్పాటై రెండు సంవత్సరాలు కావొస్తున్నా కనీస సౌకర్యాలు లేక మండలంలోని ప్రజలు ఇబ్బందులు పడుతూనే ఉన్నారు. వర్షాలు వస్తే మండల కేంద్రం నుంచి ఇతర గ్రామాలకు వెళ్లే దారులు నీటిమయమై రాకపోకలకు అంతరాయం కలుగుతోంది. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు రెండు రోజులు పలు గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. పని నిమిత్తం గట్టుప్పల్ మండల కేంద్రానికి వచ్చిన ప్రజలు వాగులు, వంకలు పొంగిపొర్లుతుండడంతో తమ గమ్యస్థానాలకు చేరుకోలేక అవస్థలు పడ్డారు. ఇక వర్షం వచ్చే సూచనలు ఉంటే మండల కేంద్రానికి రావడమే మానేసుకుంటున్నారు.

మండలంలో పరిస్థితి ఇలా..

గట్టుప్పల్‌ను 2022 సంవత్సరం అక్టోబర్‌లో రాష్ట్ర ప్రభుత్వం నూతన మండలంగా ఏర్పాటు చేసింది.



గట్టుప్పల్ నుంచి లచ్చమ్మగూడెం వెళ్లే దారిలో కల్వర్టు పైనుంచి ప్రవహిస్తున్న వరద (ఫైల్)

అనంతరం మండలంలోని పలు గ్రామాలకు రోడ్ల నిర్మాణానికి నిధులు మంజూరు చేసింది. కానీ పనులు ముందుకు సాగకపోవడంతో ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అనే చందంగా ఉంది. లింకు రోడ్లను అభివృద్ధి చేసినట్లయితే గ్రామాలకు రాకపోకలు సులువవుతాయి. కానీ మండలంలో ఎక్కడ కూడా లింక్ రోడ్ల అభివృద్ధి జరగలేదు. గట్టుప్పల్ మండల కేంద్రం నుంచి ధర్మతండాకు వెళ్లడానికి మధ్యలో కల్వర్టు ఉంది. చిన్న వర్షం వచ్చినా కల్వర్టుపై నుంచి వరద ఉధృతంగా ప్రవహిస్తుంది. దీంతో గిరిజనులు నానా ఇబ్బందులు పడుతున్నారు. గతంలో ప్రభుత్వం కల్వర్టుకు నిధులు మంజూరు చేసింది కానీ.. టెండర్ దక్కించుకున్న



గట్టుప్పల్ నుంచి ధర్మ తండా దారిలో ప్రవహిస్తున్న వరద(ఫైల్)

కాంట్రాక్టరు పనులు మొదలు పెట్టలేదు. ఇదేవిధంగా గట్టుప్పల్ మండలం నుంచి సంస్థాన్ నారాయణపురం మండలం పుట్టపాక గ్రామానికి వెళ్లడానికి మధ్యలో ఆరుమళ్ల వాగు చిన్న వర్షానికి ఉప్పొంగడంతో ఇటీవల స్థానిక ఎస్‌ఐ ప్రయాణిస్తున్న కారుకు ప్రమాదం తప్పింది. వర్షాలు వచ్చినప్పుడు తహసీల్దారు కార్యాలయం సమీపంలో కల్వర్టు, లచ్చమ్మగూడెం, అంతంపేట, వెల్మకన్నె నుంచి చర్మెడకు మధ్యలో కల్వర్టులు పొంగిపొర్లుతుంటాయి. దీంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడుతోంది. వాగులపై వంతెనలు ఏర్పాటు చేసి రాకపోకలకు అంతరాయం కలగకుండా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

వంతెనలు ఏర్పాటు చేయాలి



"భారీ వర్షాలు వస్తే వాగులు, వంకలు పొంగిపొర్లుతున్నాయి. పనుల నిమిత్తం వచ్చే ప్రజలు సొంత గ్రామాలకు చేరుకోలేక నానా ఇబ్బందులు పడుతున్నారు. వాగులపై వంతెనలు ఏర్పాటు చేసి ప్రజల ఇబ్బందులు తొలగించాలి.

–భీమనపల్లి రమేష్,వెల్మకన్నె

నిధులు మంజూరు చేయాలి



"నూతన మండలం గట్టుప్పల్‌ను వేగంగా అభివృద్ధి చేయాలి. అన్ని శాఖలకు అధికారులను ఏర్పాటు చేయడంతో పాటు ప్రభుత్వ కార్యాలయాలకు సొంత భవనాలు నిర్మించాలి. కల్వర్టుల ఏర్పాటుకు నిధులు మంజూరు చేయాలి.

–కంచుకుంట్ల సుభాష్, ఫ్లోరోసిస్ విముక్తి పోరాట సమితి కన్వీనర్

ఉర్సులో ఇబ్బందులు లేకుండా చూడండి

- కలెక్టర్ సి.నారాయణరెడ్డి

రామగిరి(నల్లగొండ): జిల్లా కేంద్రంలో ఈ నెల 16 నుంచి 19 వరకు నిర్వహించనున్న సయ్యద్ లతీఫ్ ఉల్లా షా ఖాద్రి ఉర్సులో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని కలెక్టర్ సి.నారాయణరెడ్డి అధికారులకు సూచించారు. ఎస్పీ శరత్ చంద్ర పవార్, జిల్లా అధికారులతో కలెక్టర్ కార్యాలయంలో మంగళవారం ఆయన సమీక్షించారు. 16న ఉత్సవాలు ప్రారంభమవుతాయని, 17న గంధం ఊరేగింపు ఉంటుందన్నారు. అవాంఛనీయ సంఘటనలు జరగకుండా, శాంతియుతంగా ఉత్సవాలు జరిగేలా చర్యలు తీసుకోవాలని పోలీస్ అధికారులను కోరారు. ఆర్డీఓ డీఎస్పీ ఉత్సవాలను పర్యవేక్షించాలన్నారు. ఉర్సు జరిగే చోట తాగునీరు, శానిటేషన్‌ను మున్సిపల్ కమిషనర్, జిల్లా పంచాయతీ అధికారి, మిషన్ భగీరథ ఎస్‌ఈలు ఏర్పాటు చేయాలన్నారు. ఎస్పీ శరత్ చంద్ర పవార్ మాట్లాడుతూ ఉత్సవాలను ప్రశాంతంగా నిర్వహించేందుకు అవసరమైన బందోబస్తు ఏర్పాటు చేస్తామన్నారు. పార్కింగ్, క్యూలైన్లు, బారికేడ్‌లు ఏర్పాటు చేస్తామన్నారు. రాత్రి సమయంలో బందోబస్తుకు గార్డు, సీసీ కెమెరాలు ఏర్పాటు చేయనున్నట్లు పేర్కొన్నారు. ఈ సమావే



హాజరైన అధికారులు



మాట్లాడుతున్న కలెక్టర్ నారాయణరెడ్డి

శంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ టి.పూర్ణచంద్ర, అదనపు కలెక్టర్ జే.శ్రీనివాస్, ఇన్‌చార్జ్ ఆర్డీఓ శ్రీదేవి, డీఎస్పీ శివరాంరెడ్డి, నల్లగొండ మున్సిపల్ కమిషనర్ సయ్యద్ ముసాబ్ అహ్మద్, పోలీస్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

'లతీఫ్ షా ఉర్సు జరిపే హక్కు మాదే'

నల్లగొండ పట్టణంలోని లతీఫ్ షా ఉర్సు నిర్వహించే హక్కు తమకే ఉందని సయ్యద్ హజరత్ లతీపుల్లాషా దర్గా ముతవల్లిలు సల్మాన్ ఖాద్రి, సమీవుల్లా ఖాద్రి అన్నారు. మంగళవారం దర్గా వద్ద ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ఈ సంవత్సరం ఉర్సును వక్ఫ్‌బోర్డ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తారంటూ సోషల్ మీడియాలో వార్తలు చక్కర్లు కొడుతున్నాయని పేర్కొన్నారు. బోర్డు తమకు ఎలాంటి ప్రకటన పంపలేదని, నోటీసులు కూడా జారీ చేయలేదన్నారు. 400 ఏళ్లుగా తమ పూర్వీకులే ఉత్సవాలను నిర్వహిస్తున్నారన్నారు. తమను భయపెట్టడానికి కొంతమంది కుట్రలు చేస్తున్నారని, ఎప్పటిలాగే ఈ సంవత్సరం కూడా తమ ఆధ్వర్యంలో ఉర్సు నిర్వహించడానికి పోస్టర్లు ముద్రించామన్నారు. ఈ నెల 17వ తేదీ నుంచి ఉత్సవాలు ప్రారంభం కానున్నాయని తెలిపారు. ఈ సమావేశంలో దర్గా ముతవల్లిలు రషీద్ సాబ్, ఒబేదుల్లా ఖాద్రి పాల్గొన్నారు.

దళారులను నమ్మి మోసపోవద్దు



కేతేపల్లి : కొర్లపహాడ్‌లో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వేముల వీరేశం



కనగల్: ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న డీఆర్‌డీఓ శేఖర్ రెడ్డి

- నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం

కేతేపల్లి : దళారులను నమ్మి మోసపోవద్దని నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం రైతులకు సూచించారు. మంగళవారం కేతేపల్లి మండలంలోని కొర్లపహాడ్, కొత్తపేట గ్రామాల్లో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆయన ప్రారంభించి మాట్లాడారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కేంద్రాల్లో లారీల కొరత, హమాలీల కొరత లేకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో డీసీఎంఎస్ చైర్మన్ బోళ్ల వెంకట్‌రెడ్డి, పీఏసీఎస్ సీఈఓ వడ్డె నర్సయ్య, డీసీఓ పత్యానాయక్, మండల ప్రత్యేక అధికారి హరీష్, తహసీల్దార్ ఎస్.మధుసూదన్‌రెడ్డి, ఎంపీడీఓ బి శ్రీనివాసరావు, ఏఓ బి.పురుషోత్తం, మాజీ జెడ్పీటీసీ కోట మల్లికార్జున్‌రావు, సింగిల్ విండో డైరెక్టర్‌లు గుత్తా మంజుల మాధవరెడ్డి, పల్నాటి సుధాకర్‌రెడ్డి, ఉన్నారు.

కొనుగోలు కేంద్రాల్లో వరికి మద్దతు ధర

కనగల్: రైతులు తాము పండించిన వరి ధాన్యాన్ని ఐకేపీ కేంద్రాల్లో విక్రయించి మద్దతు ధర పొందాలని డీఆర్‌డీఓ ఎర్రబెల్లి శేఖర్ రెడ్డి సూచించారు. మంగళవారం పర్వతగిరి, కనగల్, బుడుమర్లపల్లి, జి యడవల్లి, కురంపల్లి, షాబ్దుల్లాపురం, పగిడిమర్రి, దోరేపల్లి గ్రామాల్లో ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఏ గ్రేడ్ వరి క్వింటాకు రూ.2,320, సాధారణ రకానికి రూ.2,300, సన్న రకం ధాన్యానికి ఐదు వందల రూపాయల బోనస్‌ను ప్రభుత్వం చెల్లిస్తోందన్నారు. తహసీల్దార్ బి పద్మ, ఎంపీడీఓ టీ జయరాం, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు గడ్డం అనూప్ రెడ్డి, మండడి రామచంద్రారెడ్డి, నర్సింగ్ శ్రీనివాస్ గౌడ్, చిట్ల వెంకటేశం, అంజిరెడ్డి, డీటీ పార్వతమ్మ, ఎంపీఓ కె. సుమలత, ఆర్‌ఐ సునీత, ఏఆర్‌ఐ యాదగిరి, ఏపీఎం హరి, ఏపీఓ సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

తిప్పర్తి మండలంలో..

తిప్పర్తి : మండలంలోని మామిడాల గ్రామంలో ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని మంగళవారం మార్కెట్ చైర్మన్ జూకూరి రమేష్, మాజీ జెడ్పీటీసీ పాశం రాంరెడ్డితో కలిసి ప్రారంభించారు. అదేవిధంగా పజ్జూరు, యర్రగడ్డలగూడెం, తానేదార్‌పల్లి, రామలింగాలగూడెం, అంతయ్యగూడెం గ్రామాల్లో ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రాలను డీపీఎం రామలింగయ్య, ఏపీఎం శ్రీదేవి ప్రారంభించారు. కార్యక్రమంలో మండల సమాఖ్య అధ్యక్షురాలు ఎల్లంల సునిత, సీసీలు పాల్గొన్నారు.

ఆరు గ్యారంటీలను అమలు చేయాలి

చిట్యాల: కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ముందు ఇచ్చిన ఆరు గ్యారంటీలను వెంటనే అమలు చేయాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు జిట్ట నగేష్, అవిశెట్టి శంకరయ్య డిమాండ్ చేశారు. చిట్యాల మున్సిపాలిటీ పరిధిలోని పెద్దబాయిగూడెంలో మంగళవారం జరిగిన సీపీఎం మహాసభలో ఆయన పాల్గొని మాట్లాడారు. అక్కెనపల్లి నాగయ్య అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో జిల్లా కమిటీ సభ్యురాలు జిట్ట సరోజ, గోదుమగడ్డ వెంకట్‌రెడ్డి, జిట్ట స్వామి, రమేష్, లక్ష్మమ్మ, బాలనర్సమ్మ, రాధిక, మనీషా, వరమ్మ, శ్రీదేవి పాల్గొన్నారు. అనంతరం పెద్ద బాయిగూడెం సీపీఎం కార్యదర్శిగా జిట్ట స్వామి, సహాయ కార్యదర్శిగా అక్కెనపల్లి నాగయ్యను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

ముగిసిన యువకుడి అంత్యక్రియలు

నాంపల్లి : మండలంలోని చల్లవానికుంట గ్రామంలో యువకుడు మధు మృతి చెందడంతో ఆయనపై దాడి చేసినవారి ఇంటి ఎదుట బంధువులు సోమవారం రాత్రి మృతదేహాన్ని ఉంచి ధర్నా చేశారు. మంగళవారం కూడా ధర్నా చేస్తుండడంతో బాధితులకు శిక్షపడేలా చేస్తామని సీఐ నవీన్‌కుమార్ హామీ ఇవ్వడంతో గొడవ సద్దుమణిగింది. అనంతరం యువకుడి మృతదేహానికి బంధువులు, కుటుంబసభ్యులు అంత్యక్రియలు నిర్వహించారు. గ్రామంలో అవాంఛనీయ సంఘటనలు జరగకుండా స్థానిక ఎస్‌ఐ శోభన్‌బాబు, మర్రిగూడెం ఎస్‌ఐ రంగారెడ్డి, సిబ్బంది చంద్రారెడ్డి, నర్సింహ, వెంకట్ రెడ్డి, సంధ్య, మౌనిక బందోబస్తు నిర్వహించారు.

గ్రామాల అభివృద్ధికే ఇందిరమ్మ కమిటీలు

- డీసీసీబీ చైర్మన్ కుంభం శ్రీనివాస్‌రెడ్డి

మునుగోడు: గ్రామాలను అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకే ప్రభుత్వం ఇందిరమ్మ కమిటీలను ఏర్పాటు చేస్తోందని డీసీసీబీ చైర్మన్ కుంభం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మంగళవారం మునుగోడులోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన కాంగ్రెస్ పార్టీ మండల ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. నిస్వార్థంగా ప్రజాసేవ చేయాలనే తపన ఉన్నవారిని మాత్రమే కమిటీ సభ్యులుగా ఎంపిక చేయాలని సూచించారు. కమిటీ సభ్యులుగా ఎన్నికైనవారు రానున్న రోజుల్లో ప్రభుత్వం అందించనున్న సంక్షేమ పథకాలకు అర్హులను గుర్తించి అధికారుల దృష్టికి తీసుకెళ్లాల్సి ఉంటుందన్నారు. పార్టీలకు, కులాలకు అతీతంగా ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రజలకు అందేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ పోలగోని సత్యంగౌడ్, నన్నూరి విష్ణువర్ధన్‌రెడ్డి, వేమిరెడ్డి జితేందర్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు భీమనపల్లి సైదులు, మాజీ సర్పంచ్‌లు మిర్యాల వెంకన్న, జాల వెంకన్నయాదవ్, పందుల నర్సింహ, పంతంగి స్వామి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు పాల్వాయి చెన్నారెడ్డి, దోటి నారాయణ, మందుల బీరప్ప కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా అబ్దుల్ కలాం జయంతి



నకిరేకల్ : అబ్దుల్ కలాం చిత్రపటానికి నివాళులర్పిస్తున్న అధ్యాపకులు



చిట్యాల: గుండ్రాంపల్లి వివేకానంద విద్యానికేతన్ స్కూల్‌లో..

నకిరేకల్ : పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంగళవారం మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం జయంతిని జరుపుకున్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బెల్లి యాదయ్య, అసిస్టెంట్ ప్రొఫెసర్ శ్రీనివాసచారి, అధ్యాపకులు నాగ ప్రవీణ్‌రెడ్డి, శ్రీనివాస్, హరిత, శంకర్, నర్సింహాచారి, శివశంకర్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

చిట్యాల: గుండ్రాంపల్లి గ్రామంలో గల వివేకానంద విద్యానికేతన్ స్కూల్‌లో భారత మాజీ రాష్ట్రపతి ఏపీజే.అబ్దుల్ కలామ్ జయంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా అబ్దుల్ కలామ్ చిత్రపటానికి ప్రధానోపాధ్యాయుడు దోర్నాల శివ పూలమాల వేసి నివాళులర్పించారు. ఉపాధ్యాయులు మర్రి రామలింగం, రమా, విద్యార్థులు పాల్గొన్నారు.

ఓటు హక్కును వినియోగించుకోవాలి



నార్కట్‌పల్లి: ఓటరు నమోదు పత్రాలు అందజేస్తున్న యూనియన్ నాయకులు

చిట్యాల: త్వరలో జరగనున్న నల్లగొండ–ఖమ్మం–వరంగల్ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఉపాధ్యాయులంతా తమ ఓటు హక్కు వినియోగించుకోవాలని పీఆర్‌టీయూ టీఎస్ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు కందాల చంద్రారెడ్డి కోరారు. చిట్యాల మండలం ఏపూరు గ్రామంలోని జెడ్పీహెచ్‌ఎస్‌లో ఉపాధ్యాయులకు మంగళవారం ఆయన ఓటరు నమోదు పత్రాలను అందజేసి మాట్లాడారు. సంఘం జిల్లా అసోసియేట్ అధ్యక్షుడు జడల వెంకన్న, జిల్లా ఉపాధ్యక్షుడు ఎండీ.వాహీద్, హెచ్‌ఎం కైసర్ సబిహా, ఉపాధ్యాయులు కోమటిరెడ్డి బుచ్చిరెడ్డి, బుర్రి గోపాల్‌రెడ్డి, లింగాల నర్సయ్య పాల్గొన్నారు.

నార్కట్‌పల్లి: మండలంలోని అక్కెనపల్లి జెడ్పీహెచ్‌ఎస్‌లో మంగళవారం నల్లగొండ–ఖమ్మం–వరంగల్ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల ఓటరు నమోదు కార్యక్రమాన్ని పీఆర్‌టీయూ టీఎస్ జిల్లా మాజీ ప్రధానకార్యదర్శి బసిరెడ్డి రవీందర్‌రెడ్డి ప్రారంభించారు. కార్యక్రమంలో సంఘం మండల అధ్యక్షుడు ఏనుగుల శ్రీనివాస్‌రెడ్డి, ప్రధానకార్యదర్శి అయ్యపురెడ్డి, చిక్కుళ్ళ మదనయ్య, ఇద్దయ్య, గులాం ముస్తాఫా, గాయం నర్సింహారెడ్డి, వెంకటేశం, లింగారెడ్డి, విష్ణుమూర్తి, సునిత, సత్యనారాయణ పాల్గొన్నారు.

నేటి నుంచి శ్రీ వేణుగోపాలస్వామి ఆలయ ఉత్సవాలు

చిట్యాల: మండలంలోని వట్టిమర్తి గ్రామంలో పునర్నిర్మించిన శ్రీ వేణుగోపాల స్వామి ఆలయ సప్తాదశ వార్షిక కల్యాణోత్సవాలు(బ్రహ్మోత్సవాలు) బుధవారం (16వ తేదీ) నుంచి ప్రారంభం కానున్నాయి. ఉత్సవాల్లో భాగంగా విశ్వక్సేనారాధణ, స్వస్తి వాచనం, అఖండజ్యోతి స్థాపన, యజ్ఞం నిర్వహించనున్నారు. బుధవారం స్వామివారి తిరు కల్యాణోత్సవం, వడి బియ్యం కార్యక్రమాలు నిర్వహిస్తారు. 17వ తేదీన మహా కుంభాభిషేకం, మహానైవేద్యం కార్యక్రమాలతో ఉత్సవాలు పూర్తవుతాయి.

గతంలో ధ్వంసమైన ఆలయం

వట్టిమర్తి గ్రామంలోని శ్రీ వేణుగోపాల స్వామి ఆలయం ఎంతో మహిమాన్వితమైనదిగా చెప్పుకుంటారు. గతంలో కొందరు నిరంకుశ పాలకులు ఈ ఆలయాన్ని ధ్వంసం చేశారని పూర్వీకులు చెబుతుంటారు. అనంతరం పలువురి రాజుల పాలనలో ఈ ఆలయం అభివృద్ధి చెందింది. కలియుగాంతంలో ఈ శ్రీవేణుగోపాల స్వామి ఆలయంలో కర్రె ఆవు పాలుతాగి మర్రి ఆకుపై శయనిస్తాడని ప్రతీతి.

ఇదీ ఆలయ చరిత్ర..

వట్టిమర్తిలో సుమారు వేయి సంవత్సరాల క్రితం ఈ ఆలయాన్ని నిర్మించినట్లు తెలుస్తోంది. కాకతీయుల కాలంలో ఈ ఆలయం అభివృద్ధి చెందింది. అనంతరం జౌరంగజేబు పాలనలో ఈ ఆలయం ధ్వంసం చేయబడి, నిజాం కాలంలో పూర్తిగా శిథిలమైంది. ఆలయాన్ని పదిహేడేళ్ల క్రితం ఆ గ్రామ మాజీ సర్పంచ్, ఆలయ చైర్మన్ నర్రా మోహన్‌రెడ్డి గ్రామస్తుల సహకారంతో పునర్నిర్మించారు.



శ్రీ వేణుగోపాలస్వామి మూలవిరాట్టు

గర్భాలయంలో మర్రి చెట్టు..

వేణుగోపాల స్వామి గర్భాలయంలోని స్వామివారి మూల విరాట్టు పాదాల వద్ద మర్రిచెట్టు ఆవిర్భవించింది. ఈ ఆలయంలో పూజలు చేసి మొక్కుకున్నట్లయితే కోరిన కోరికలు నేరవేరుతాయని పండితులు చెబుతుంటారు.



వట్టిమర్తిలోని శ్రీ వేణుగోపాలస్వామి ఆలయం

ఉత్సవాలను విజయవంతం చేయాలి



"వేణుగోపాలస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలను భక్తులు, గ్రామస్తులు విజయవంతం చేయాలి. ఈ ఉత్సవాలను వైభవంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేశాం. ఉత్సవాల నిర్వహణకు ప్రతి ఒక్కరూ సహకరించాలి.

–నర్రా మోహన్‌రెడ్డి.
ఆలయ చైర్మన్, వట్టిమర్తి

18న కల్లుగీత కార్మిక సంఘం వార్షికోత్సవాలు

చిట్యాల: హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఈ నెల 18వ తేదీన నిర్వహించనున్న రాష్ట్ర కల్లుగీత కార్మిక సంఘం అరవై ఐదో వార్షికోత్సవాలను విజయవంతం చేయాలని సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు పామనగుళ్ల అచ్చాలు కోరారు. చిట్యాలలో మంగళవారం జరిగిన సంఘం సమావేశంలో వార్షికోత్సవాల ప్రచార కరపత్రాలను ఆయన విడుదల చేసి మాట్లాడారు. మామిడి హన్మంతు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో రాష్ట్ర కమిటీ సభ్యుడు గునగంటి కృష్ణయ్య, మాదగోని దేవయ్య, ఊడుగు సత్తయ్య, నకిరేకంటి రాములు, గుర్జ భిక్షం, కట్టంగూరి శ్రీను, పాలకూరి వెంకటేశం పాల్గొన్నారు.

చండూరు : హైదరాబాద్‌లో ఈ నెల 18న జరిగే కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర సదస్సును విజయవంతం చేయాలని సంఘం జిల్లా అధ్యక్షుడు కొండ వెంకన్న పిలుపునిచ్చారు. సదస్సుకు సంబంధించిన కరపత్రాన్ని మంగళవారం చండూరు మండల కేంద్రంలో ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. సంఘం జిల్లా సహాయ కార్యదర్శి జెర్రిపోతుల ధనంజయ్య, రవీందర్, కిరణ్, యాదయ్య, కృష్ణయ్య, భిక్షం, పెంటయ్య, రోశయ్య, అంజయ్య, శ్రీను, వెంకటేశం పాల్గొన్నారు.

వాల్మీకి విగ్రహ ఊరేగింపు



ఊరేగింపులో పాల్గొన్న ఆదిధర్మ సమాజ్ సభ్యులు

నల్లగొండ టౌన్: వాల్మీకి ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠాపన సందర్భంగా మంగళవారం నల్లగొండ పట్టణంలోని బొట్టుగూడ నుంచి బస్టాండ్, క్లాక్‌టవర్, అంబేద్కర్ సర్కిల్, వాల్మీకినగర్ వరకు వాల్మీకి విగ్రహాన్ని ఊరేగించారు. కార్యక్రమంలో ఆదిధర్మ సమాజ్ ఆదాస్ భారత్ సభ్యులు రాంపాల్, పాండు, రవి, మురహరి, రమేష్ పాల్గొన్నారు.

చేతుల పరిశుభ్రతపై అవగాహన

మర్రిగూడ: గ్లోబల్ హ్యాండ్‌వాషింగ్ డే సందర్భంగా మర్రిగూడ మండలంలోని దామెరబీమనపల్లి ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు మంగళవారం ప్రధానోపాధ్యాయుడు ఉదావత్ లచ్చిరాం చేతుల పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు మంజులత, కొండా శ్రీను తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు నిలిపివేయడం తగదు

నాంపల్లి : నియోజకవర్గంలో అభివృద్ధి పనులు నిలిపివేయడం ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డికి తగదని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఎరెడ్ల శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. నాంపల్లి మండల కేంద్రంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పేదలను స్థానిక ఎస్‌ఐ శోభన్‌బాబు ఇష్టానుసారంగా దుర్భాషలాడుతున్నారని, ఈ విషయమై ఎస్పీ చర్యలు తీసుకోవాలన్నారు. కిష్టరాయిన్‌పల్లి, చర్లగూడెం ప్రాజెక్ట్ పనులపై దృష్టిపెట్టాలని ఎమ్మెల్యేను కోరారు. ఈ సమావేశంలో బీజేపీ మండల అధ్యక్షుడు దాచపల్లి నర్సింహ, చిరుమావిళ్ళ గిరిబాబు, చలమల కాంతారెడ్డి, లింగస్వామి, బొడ్డుపల్లి నరహరి, నాంపల్లి సతీష్, బొంత వెంకటయ్య, కామిశెట్టి శ్రీను తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎరెడ్ల శ్రీనివాస్‌రెడ్డి

సమస్యలు పరిష్కరించాలి

నల్లగొండ: ప్రభుత్వం గురుకుల పాఠశాలల సమస్యలు పరిష్కరించాలని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ఆకారపు నరేష్, ఖమ్మంపాటి శంకర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. సంవత్సరం నుంచి అద్దె చెల్లించకపోవడంతో విద్యా సంస్థలకు తాళాలు వేయక తప్పడం లేదని యజమానులు చెబుతున్నారని అన్నారు.

ఎయిడ్స్ నిర్మూలనపై కళాజాతా

నకిరేకల్ : హెచ్‌ఐవీ, ఎయిడ్స్ సుఖవ్యాధులు రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై నేషనల్ ఎయిడ్స్ కంట్రోల్ ఆర్గనైజేషన్, తెలంగాణ ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ ఆధ్వర్యంలో మంగళవారం నకిరేకల్ పట్టణంలో అభినవ్ ఆర్ట్స్ అకాడమీ కళా బృందం వారు కళాజాతా నిర్వహించారు. కార్యక్రమంలో తెలంగాణ ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ అధికారి నరసింహస్వామి పాల్గొని మాట్లాడుతూ ఎయిడ్స్ వ్యాధికి మందు లేదని, నివారణ ఒక్కటే మార్గమన్నారు. కార్యక్రమంలో భిక్షమయ్య, చెట్టుపల్లి వెంకన్న, పరమేష్, నాగరాజు, లింగస్వామి, నరసింహ, ప్రవీణ్, శైలజ తదితరులు పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న కళా బృందం సభ్యులు